'ప్రజా పాలన' గ్రామ సభలకు నిరసన సెగలు తప్పడం లేదు. ప్రభుత్వ పథకాలు అందక అడుగడుగునా అధికారులను ప్రశ్నిస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ప్రజల నిరసనలను అణిచి వేయడానికి గ్రామ సభకో ముగ్గురు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అనర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం, రేషన్ కార్డుల జాబితాల్లో అర్హుల పేర్లు గల్లంతు కావడం జీర్ణించుకోలేక ప్రజలు అధికారుల తీరుపై మండి పడుతున్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెబుతుండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సుల్తానాబాద్ రూరల్ : సుద్దాలలో అధికారులను నిలదీస్తున్న వ్యక్తి

ఓదెల: అబ్బిడిపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

గ్రామ సభల్లో లొల్లి.. లొల్లి

జూలపల్లి, జనవరి 22 : మండలంలోని వడ్కాపూర్, కీచులాటపల్లి, బాలరాజ్‌పల్లి, కుమ్మరికుంట, వెంకట్రావ్‌పల్లి గ్రామాల్లో బుధవారం సభలు నిర్వహించారు. వడ్కాపూర్ సభకు ఎమ్మెల్యే విజయరమణారావు హాజయ్యారు. దరఖాస్తులు చేసుకోడానికి కౌంటర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఒక్కసారి పెద్ద ఎత్తున గ్రామస్తులు ఎగబడ్డారు. తమకు గుంట భూమిలేకున్నా ప్రభుత్వ పథకాలు ఎందుకు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబితాలో పేర్లు లేకపోతే మరోసారి దరఖాస్తు పెట్టుకోవాలని అధికారులు చెప్పడంతో ఇంకా ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకోవాలని ధ్వజమెత్తారు. వేర్వేరు కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి శంకర్, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో పద్మజ, ఏవో ప్రత్యూష, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీవో సదానందం సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు దారబోయిన నరసింహం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిలదీత

ఓదెల, జనవరి 22: లంబాడితండా, అబ్బిడిపల్లి, జీలకుంట పిట్టల ఎల్లయ్యపల్లె, గూడెం, హరిపురంలో నిర్వహించిన సభల్లో అధికారులను ప్రజలు నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో 20 రోజులు ఈజీఎస్ పని చేసే వారికే వర్తింపజేయడంపై కూలీలు నిలదీశారు. హరిపురంలో ఓ పేదవాడు అనారోగ్యంతో ఈజీఎస్ పనికి వెళ్లలేక పోతే అతనికి ఎందుకు వర్తించదని బీఆర్ఎస్ నాయకుడు గుండేటి మధు అధికారులు ప్రశ్నించారు. గ్రామసభల్లో ప్రశ్నిస్తున్న ప్రజలను పోలీసులు నిలువరించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో తిరుపతి, డీటీ బాలసాని శ్రీనివాస్‌గౌడ్, ఏవో భాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్/సుల్తానాబాద్ రూరల్,జనవరి 22: చిన్నబొంకూర్, సుద్దాల, తొగర్రాయి, భూపతిపూర్, ఐతరాజ్‌పల్లి, మంచరామి, చిన్నకల్వల, గర్రెపల్లి, నారాయణపూర్‌లో మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో దివ్యాదర్శన్ రావు ప్రజాపాలన సభలకు హాజరయ్యారు. సుద్దాల పలువురు అధికారులను నిలదీశారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ గొడవలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. సుల్తానాబాద్‌లోని 14వ వార్డులో నిర్వహించిన వార్డు సభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, తహసీల్దార్, మధుసూదన్‌రెడ్డి, కమిషనర్ అకుల వెంకటేష్, నాయకులు పాల్గొనారు.

మళ్లీ దరఖాస్తు చేసుకోండి

పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్/పెద్దపల్లి రూరల్, జనవరి22: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే విజయరమణారావు వివరించారు. పట్టణంలోని 22, 34వ వార్డు సభల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. అలాగే 15, 16, 21, 22, 27, 28, 34తో పాటు పలు వార్డులు మండలంలోని పలు గ్రామాల్లో సభలు నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్, జనవరి22: అర్హుల జాబితాలో పేర్లు రాని మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో ప్రజాపాలన గ్రామ సభకు ఎమ్మెల్యే హాజయ్యారు. లక్ష్మీపురం, వెన్నంపల్లి, మడిపల్లి, పెద్దరాతపల్లి, పెద్దంపేట, మీర్జంపేట, జాఫర్‌ఖాన్‌పేట, మొట్లపల్లిలో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలకు తాము అన్ని విధాలా అర్హులమైనా జాబితాలో తమ పేర్లు లేవని పెద్దంపేట, పెద్దరాతపల్లి గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ వకీల్, మండల ప్రత్యేకాధికారి శ్రీమాల, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఏవో నాగార్జున, ఏపీవో మంజుల, ఎస్సై వెంకటేశ్, ఎంపీవో కిరణ్, పాల్గొన్నారు

ప్రజా పాలన రసాభాస

ధర్మారం,జనవరి22: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలు రసాభాసగా మారాయి. లంబాడి తండా(కె),ధర్మారం,బంజేరుపల్లి,చామనపల్లి,ఖిలావనపర్తి,బొట్లవనపర్తి, గోపాల్‌రావుపేట,రచ్చపల్లి గ్రామాలలో గ్రామ సభలు జరిగాయి. ధర్మారం,గోపాల్‌రావుపేట,బొట్లవనపర్తిలో ప్రజలు అధికారులను నిలదీశారు. ధర్మారంలో 1360 ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు రాగా అందులో సర్వే చేసి 600 మందిని మాత్రమే గుర్తించారు. మిగతా పేర్లు రానివారంతా సభకు వచ్చి అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీపీవో వీర బుచ్చయ్య, తహసీల్దార్ ఎండి ఆరిఫొద్దీన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ సభ స్తంభించడంతో ఎస్ఐ లక్ష్మణ్ సముదాయించే ప్రయత్నం చేసినా వారు ఆందోళన విరమించలేదు. దీంతో చాలా సేపు సభ గందరగోళంగా జరిగింది.గోపాల్‌రావుపేట, బొట్లవనపర్తి గ్రామ సభలు నిరసనలతో దద్దరిల్లాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఒక్క ఇంట్లో ఉన్న ముగ్గురిని సర్వేలో ద్వారా వచ్చిన పేర్లను చదివి వినిపించగానే దరఖాస్తు చేసుకున్నవారు అధికారులపై మండిపడ్డారు.ఆర్థికంగా ఉన్న అనర్హుల పేర్లు సర్వేచేసిన జాబితాలో ఉన్నాయని ఒక్కో ఇంటిలో ఇద్దరి,ముగ్గురు పేర్లు ఎలా ఉంటాయని గ్రామస్తులు అధికారులను నిలదీశారు.అనర్హుల పేర్లు తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

సభావేదికపై కాంగ్రెస్ నాయకులు

ధర్మారంలోని రైతు వేదికలో జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో ఇద్దరు కాంగ్రెస్ నాయకులు సభా వేదికపై కూర్చోవడం చర్చనీయాంశమైంది. సభలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పక్కన వారిద్దరు ఆశీనులు కావటం ఏమిటని అక్కడకు వచ్చిన ప్రజలు విస్తూపోయారు.

ఇదే చివరి జాబితా కాదు..

కోల్‌సిటీ/యైటింక్లయిన్ కాలనీ/జ్యోతినగర్/పాలకుర్తి/అంతర్గాం, జనవరి 22: ప్రాథమికంగా ప్రకటించిన జాబితాలో పేర్లు రాలేదని ఆందోళన అవసరం లేదనీ, దరఖాస్తు అందిస్తే వారం పది రోజుల్లో వాటిని విచారించి పథకాల లబ్ధి చేకూరుస్తామని తెలిపారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులు తమ దరఖాస్తులను ఎప్పుడైనా ఇవ్వొచ్చని, కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఇల్లు ఉండి కూడా ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు వస్తే ఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపి తొలగిస్తామని తెలిపారు. రామగుండం 38వ డివిజన్‌లో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభను కలెక్టర్ సందర్శించారు. వార్డు సభలో దరఖాస్తు చేసుకోలేనివారు స్థానిక మున్సిపల్ ఆఫీసులోనూ దరఖాస్తు సమర్పించవచ్చని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ (ఎఫ్ఏసీ) కమిషనర్ జే.అరుణ శ్రీ తెలిపారు. బుధవారం రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని 3,4,8,9,13,18, 19,23, 24, 28, 29,33, 34, 38, 39, 43, 44, 48, 49 డివిజన్లలో సభలు జరిగాయి.

దరఖాస్తు ఫారాలు లేక ఇక్కట్లు

కార్పొరేషన్ పరిధిలోని 18,19 డివిజన్, రామగిరి మండలం వెంకట్రావుపలి, ముస్త్యాలలో సభలు జరిగాయి. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. జాబితాలో పేర్లు రాని మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్కడ దరఖాస్తు ఫారాలు లేకపోవడంతో ఇక్కట్లు పడ్డారు. సభల వద్ద కాంగ్రెస్ నాయకులు దరఖాస్తు ఫారాలు తీసుకుంటూ కనిపించారు. పాలకుర్తి జనవరి22: పాలకుర్తి మండల కేంద్రంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభకు బుదవారం జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష హాజరయ్యారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా, ప్రతి ఒక్కరి దరఖాస్తును స్వీకరించాలని కోరారు. ప్రజలు ఎప్పుడు కావలంటే అప్పుడు ప్రభుత్వపథకాలకు దరఖాస్తులు చేసుకోవచ్చునని సూచించారు. ప్రస్తుతం ప్రాథమికంగా ప్రకటించిన జాబితాలో పేర్లు రాని వారు ఆందోళన చేందకుండా, మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని, 10రోజుల్లో వాటిని విచారించి పథకాల లబ్ధి చేకూరస్తామన్నారు.

ఆందోళనలు.. ఆగ్రహాల మధ్య..

కమాన్‌పూర్, జనవరి 22: గుండారం, గొల్లపల్లి, రొంపికుంటలో సభలు జరిగాయి. గొల్లపల్లిలో లబ్ధిదారులనే విషయాన్ని ప్రకటించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.ఈ గ్రామ సభల్లో మండల ప్రత్యేకాధికారి ప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీవో లలిత, తహసీల్దార్ వాసంతిలతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంథని/మంథని రూరల్, జనవరి 22: మంథని పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాపాలన సభలు నిర్వహించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

కల్వచర్లలో కాంగ్రెస్ నేతలకు దరఖాస్తులు

రామగిరి, జనవరి 22:కల్వచర్ల, ఆదివారంపేట, లద్నాపూర్‌లో గ్రామ సభలు జరిగాయి. ఆయా పథకాలకు సంబంధించి జాబితాలోని వారి పేర్లు చదివి వినిపించారు. కల్వచర్లలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభ వేదికపై నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు కూర్చున్నారు. తమకు అనుకూలమైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని సీఎం, మంత్రులు చెబుతున్నా కల్వచర్లలో మాత్రం కాంగ్రెస్ నాయకులే అన్నీ తామై వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు.

నా మనవడిని ఆదుకోండి

తల్లిదండ్రులను కోల్పోయిన తన మనవడిని ఆదుకోవాలని పెద్దపల్లిలోని పదో వార్డు రంగంపల్లికి చెందిన కుక్క రాజమ్మ ఎమ్మెల్యే విజయ రమణారావును వేడుకుంది. పెర్క రవి,అన్నపూర్ణ దంపతులకు కుమారుడు అభిషేక్ (16) ఉన్నాడు. నెల కిత్రం వారం వ్యవధిలోనే తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందారు. 10వ వార్డులో నిర్వహించిన సభకు తన మనవడిని తీసుకొని వెళ్లింది రాజమ్మ. అనాథగా మారిన బాలుడికి ప్రభుత్వం విద్యాబుద్ధులు నేర్పించాలని వేడుకుంది.

ధర్మారం:ధర్మారంలో ప్రజా పాలన సభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

పెద్దపల్లి రూరల్: బ్రాహ్మణపల్లిలో అధికారులను ప్రశ్నిస్తున్న మూల రమేశ్

మత్స్యకారులకు చిక్కిన భారీ చేప

తుమ్మలకుంట చెరువులో భారీ చేప

ముత్తారం, జనవరి 22: మండలంలోని ఓడేడు పరిధిలోని తుమ్మలకుంట చెరువులో మత్స్యకారులకు భారీ చేప దొరికింది. ఈ చెరువులో కొన్నిరోజులుగా మత్స్యకారులు చేపలు పడుతున్నారు. బుధవారం పెద్ద సంఖ్యలో చేపలు చిక్కాయి. అందులో 15 కిలోల పైగా బరువు ఉన్న గ్యాస్ కట్ రకం చేప మత్స్యకారుల వలలో పడింది. పెద్ద చేప దొరకడంతో మత్స్యకారులు, ముదిరాజ్ లు ఆనందం వ్యక్తం చేశారు.

లేడీస్ క్లబ్ బొమ్మల కొలువు

వేడుకలో రామగుండం రీజియన్ జీఎంల సతీమణులు, సభ్యులు

గోదావరిఖని, జనవరి 22: సింగరేణి ఆర్జీ-1 లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఇల్లందు క్లబ్‌లో అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్ బొమ్మల కొలువు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సింగరేణి సీఎండీ సతీమణి శారద బలరాం హాజరయారు. జ్యోతిప్రజ్వల చేసి బొమ్మల కొలువును ప్రారంభించారు. ఈ బొమ్మల కొలువులో సంస్కృతి, సంప్రదాయంతో ఏర్పాటు చేసిన కుటీరం, మంచె, పర్ణశాల, సమ్మక్క సారక్కలతో పల్లెటూరి వాతావరణాన్ని తలపించే పలు రకాల బొమ్మలను రూపొందించారు. వాటికి పూజలు చేశారు. ఇక్కడ సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్ సతీమణి హరిణి సత్యనారాయణ రావు, డైరెక్టర్ పీపీ సతీమణి సునీత వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్జీ-1,2,3 జీఎంలు లలిత్‌కుమార్, వెంకటయ్య, కార్పొరేట్ సేఫ్టీ జీఎం సతీమణి చింతల లక్ష్మీ శ్రీనివాస్, జీఎంల సతీమణులు వనజ, అలివేణి, విజయలక్ష్మి, లలిత, వాణి, లేడీస్‌క్లబ్ సభ్యులు చిలక లక్ష్మీ, కవిత, తార, విజయ, శ్రీవాణి, హేమ, కల్యాణి ఉన్నారు.

200 మొబైల్ ఫోన్ల అప్పగింత

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 22: మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్న, చోరీకి గురైన వారు సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ సూచించారు. కమిషనరేట్ పరిధిలో ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న, చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను సీసీఎస్, ఐటీసెల్ బృందాలు గుర్తించాయి. బుధవారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ శ్రీనివాస్ రూ.25,68, 997 విలువైన 200 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు 5,280 సీఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా.. 1,538 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని యాజమానులకు అప్పగించినట్లు తెలిపారు. ఫోన్ల రికవరీలో పాల్గొన్న ఐటీసెల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, సీసీఎస్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల పోలీస్ అధికారులు, సిబ్బంది, ఐటీ సెల్ కోఆర్డినేటర్ హెడ్‌కానిస్టేబుల్ రాము, బీ రమేశ్, వీ రాజేందర్‌లను సీపీ అభినందించారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలోఅడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తప్పుడు వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీమ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం సీపీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో సూచించారు. సైబర్ నేరగాళ్లు ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకునేందుకు కొత్త పద్ధతులను ప్రయోగిస్తున్నారని తెలిపారు. ఇలాంటి స్కీమ్‌ల పట్ల నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనుమానిత లింకులు, అప్లికేషన్స్‌ను ఎవరు ఓపెన్, ఇన్‌స్టాల్ చేయొద్దన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సైబర్ క్రైమ్ పోలీసు ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని సింగరేణి వీటీసీ సెంటర్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వ హించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో ఇటీవల ఎక్కువగా ప్రజలు మోసపోయి డబ్బులు పోగొట్టుకుంటున్న డిజిటల్ అరెస్ట్‌కు సంబంధించిన సైబర్ క్రైమ్‌ను వివరించారు. ఇక్కడ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎస్ హెచ్ డీఎస్పీ ఎం వెంకటరమణ, వీటీసీ సెంటర్ సిబ్బంది ఉన్నారు.

'దేశ్‌కా ప్రకృతి పరిరక్షణ్'

జ్యోతినగర్, జనవరి 22: ఆరోగ్యం, ప్రకృతి పరిరక్షణ కోసం భారత ప్రభుత్వం చెపట్టిన దేశ్‌కా ప్రకృతి పరిరక్షణ్ కార్యక్రమం బుధవారం సీఐఎస్ఎఫ్ ఎన్టీపీసీ రామగుండం యూనిట్‌లో జరిగింది. మంచిర్యాల ఆయుర్వేద దవాఖాన జిల్లా ఇన్‌చార్జి సహకారంతో చెపట్టిన ఈ కార్యక్రమంలో ఐఎస్ఎఫ్ సిబ్బందికి వారి కుటుంబాలకు ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత ప్రాము ఖ్యతపై ఆయుర్వేద వైద్యులు అవగాహన కల్పించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ ప్రకృతి పరిరక్షణ అప్లికేషన్ యాప్ డౌన్‌లోడ్‌తో వైద్య పరీక్షలు చేపట్టారు. ఇక్కడ వైద్యాధికారి నీరజ, సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ ముఖేశ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

వర్గీకరణను అడ్డుకుంటే

వివేక్‌కు బుద్ధి చెబుతాం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

పెద్దపల్లి టౌన్, జనవరి22: మాదిగ ఉప కులాల ఏబీసీడీ వర్గీకరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తే గడ్డం వివేక్‌కు రానున్న ఎన్నికల్లో మాదిగలు తగిన బుద్ధి చెబుతారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో బుధవారం పెద్దపల్లి-కరీంనగర్ జిల్లాల సన్నాహాక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, మూడు తరాల నుంచి మాలలు, మాదిగలకు వ్యతిరేకంగా గడ్డం వివేక్ కుటుంబం పని చేస్తున్నదని తెలిపారు. మాదిగ, ఉపకులాల పిల్లల భవిష్యత్ కోసమే 30ఏండ్లు సుదీర్ఘ పోరాటం చేసినట్లు తెలిపారు. ఉద్యయంలో ఎన్నో ఆటుపోట్లు, అరెస్టులు, నిర్బంధాలు ఎదుర్కొని నిలబడ్డామని, చివరి దశకు చేరిన వర్గీకరణను అడ్డుకునేందుకు కొందరు కట్రలు చేస్తున్నారని, ఈ విషయంలో మాదిగలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించతపెట్టిన వెయి గొంతులు-లక్ష్య డప్పులు కళా మహా ప్రదర్శనకు మాదిగలు, ఉప కులాలు వారు ఇంటికో డప్పు, ఊరికో బస్సుతో కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కాశిపేట లింగయ్య, బోడిగే శోభ, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, ఏఎంసీ చైర్మన్ ఈర్ల స్వరూప, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్, ఉమ్మడి జిల్లా నాయకులు రామంచ భరత్, ఇంజం వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు అంగన్‌వాడీ టీచర్

గోదావరిఖని/కోల్‌సిటీ, జనవరి22: గోదావరిఖని ఇందిరానగర్-5 అంగన్‌వాడీ సెంటర్ టీచర్ నాగుల మల్యాల స్వర్ణలతకు సువర్ణ అవకాశం దక్కింది. ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగే 76వ గణతంత్ర వేడుకలకు భారత ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందుకుంది. రాష్ట్రం నుంచి ఐదుగురు అంగన్‌వాడీ టీచర్లు ఎంపిక కాగా, ఇందులో స్వర్ణలత కూడా ఉన్నారు.

పారా ఒలింపిక్ క్రీడాకారిణికి చేయూత

- కేటీఆర్ చేతుల మీదుగా రూ. లక్ష సాయం

పారా ఒలింపిక్ క్రీడాకారిణికి సాయం అందజేస్తున్న కేటీఆర్

పాలకుర్తి, జనవరి22: మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వ్యాళ్ల హరీశ్ రెడ్డి వీహెచ్ఆర్ ట్రస్టు ద్వారా పారా ఒలింపిక్ క్రీడాకారిణి కృష్ణవేణికి చేయూతనందించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా తెలంగాణ భవన్‌లో రూ. లక్ష సాయం అందజేశారు. హరీశ్ రెడ్డి 15 ఏళ్లుగా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగంలో పని చేస్తున్నారు. హరీశ్ రెడ్డిని ఆదర్శంగా తీసుకొని పేద క్రీడాకారులు, పేద విద్యార్థులకు సాయం అందించాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను సైతం హరీష్‌రెడ్డి సోషల్‌మీడియా వేదికగా ఎండగడుతున్నాడని తెలిపారు. కార్యక్రమంలో హరీశ్ రెడ్డి తండ్రి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వ్యాళ్ల రాంరెడ్డి పాల్గొన్నారు.

ఏహెచ్ఏ అధ్యక్షురాలిగా సిమ్స్ ప్రిన్సిపాల్

హిమబిందు సింగ్

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 22: ఏహెచ్ఏ (అడల్సెంట్ హెల్త్ అకాడమీ) కౌమార ఆరోగ్య సంస్థ జాతీయ అధ్యక్షురాలిగా రామగుండం సిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ ఎన్నికయ్యారు. ఈ నెల 8నుంచి 12వరకు హైదరాబాద్ గచ్చిబౌలిలోని హైటెక్స్‌లో జరిగిన ఇండియన్ పీడియాట్రిక్స్ అసోసియేషన్ (జాతీయ పిల్లల వైద్యుల సంఘం) 62వ పెట్‌కాన్ సమావేశంలో ఐఏపీలో ఓ విభాగమైన కౌమార వైద్య సమాఖ్యకు దేశ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఏడాది పాటు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. గతంలో ఈ పెట్‌కాన్ సదస్సుకు జాయింట్ ఆర్గనైజింగ్ చైర్మన్‌గా పనిచేశారు. అలాగే నిలోఫర్ దవాఖాన, యువ దవాఖాన విభాగ అధిపతిగా పని చేశారు. హిమబిందుసింగ్ ఎన్నికపై వైద్య కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఆరు గ్యారెంటీల అమలులో విఫలం

- పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మమతారెడ్డి

పెద్దపల్లి, జనవరి22: 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక వాటిని చేయడంలో విఫలమైందని మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రజా విశ్వాసం కోల్పోయిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ నాలుగు కొత్త పథకాలను తెరమీదకు తెచ్చి సభల పేరిట ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం 21వ వార్డు పరిధిలోని నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. పట్టణంలో దాదాపు 70వేల మంది ఉంటే కేవలం 2500 మందిని మాత్రమే రేషన్ కార్డులకు అర్హులుగా పేర్కొనడంపై అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గందరగోళానికి గురి చేస్తున్న ప్రభుత్వం

సుల్తానాబాద్ రూరల్, జనవరి 22: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సభలతో ప్రజలను తీవ్ర అయోమయానికి గురి చేస్తున్నదని బీఆర్ఎస్ మండల కన్వీనర్, మాజీ ఎంపీటీసీ మైలారం నారాయణ, బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు గరిగంటి కుమార్ బాబు విమర్శించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి , తీరా అధికారంలోకి వచ్చాక సర్వేలు, దరఖాస్తుల స్వీకరణ పేరిట కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. జాబితాలో పేర్లు లేవని చెబితే అధికారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సమాధానమివ్వడం విడ్డూరంగా ఉందన్నారు.

అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలి

కమాన్‌పూర్, జనవరి 22: ప్రజాపాలన సభలు, సర్వేల పేరిట కాలయాపన చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.కమాన్‌పూర్‌లోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం వారు మాట్లాడారు .ప్రజా పాలన గ్రామ సభలు లబ్ధిదారుల ఎంపిక కోసమంటూ ప్రచారం చేస్తున్నప్పటికీ, కేవలం అర్హుల జాబితాలను అధికారులతో చదివిస్తూ మమ అనిపిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు ప్రకటిస్తున్న జాబితాలో అనర్హులే ఎక్కువగా ఉంటున్నారని ఆరోపించారు. గ్రామ సభల్లో అధికారులను నిలదీస్తున్న తీరే ఇందుకు నిదర్శనమని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ శంకర్, మాజీ జడ్పీటీసీ మేకల సంపత్ యాదవ్, యూత్ మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, పెండ్లి నారాయణ, మచ్చ గట్టయ్య, రాచకొండ రవి, పోలుదాసరి సాయికుమార్, మాచీడి శంకర్, రామ్మూర్తి, తోట రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జాబితా ఫైనల్ కానప్పుడు సభలు ఎందుకు?

ముత్తారం, జనవరి 22: మండలంలో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రకటిస్తున్న లబ్ధిదారుల జాబితా ఫైనల్ కాదని ఎంపీడీవో సురేశ్ తెల